వీధి దీపాల నిర్వహణలో నిర్లక్ష్యం

పట్టణంలో ఉదయం పది గంటల తర్వాత వెలుగుతున్న సెంట్రల్ లైటింగ్

మెట్‌పల్లి పట్టణంలో వీధి దీపాల నిర్వహణలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారు. పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ గురువారం ఉదయం పది గంటల తర్వాత కూడా వెలుగుతూనే ఉంది. కొద్ది రోజులుగా రాత్రి చీకటి పడి ఏడు గంటలు దాటినా లైట్లు వేయడం లేదని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి పట్టణంలో వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

-మెట్‌పల్లి టౌన్, మే 15

గ్రంథాలయ సిబ్బందికి వేతనాలు చెల్లించాలి

మాట్లాడుతున్న పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్

జగిత్యాల, మే 15: గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు వేతనాలు, పెన్షనర్లకు పెన్షన్ డబ్బులు రెండు నెలలుగా రాక ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఆయన జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, పెన్షనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరి అశోక్‌కుమార్ మాట్లాడుతూ, ప్రతి నెలా సక్రమంగా వేతనాలు రాకపోవడంతో గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, పెన్షనర్లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గ్రంథాలయ ఉద్యోగులకు రెండు నెలల వేతనాలు, పెన్షనర్లకు పెన్షన్ డబ్బులు చెల్లించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్‌కు ప్యాక్స్ ద్వారా వినతిపత్రం పంపినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు విజయ్, ప్రకాశ్ రావు, విశ్వనాథం పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న గుంత

కోరుట్ల మండలం వెంకటాపూర్-గుమ్లాపూర్ ఎక్స్‌రోడ్ వద్ద జాతీయ రహదారి పక్కన మిషన్ భగీరథ పైపులైన్‌కు లీకేజీ పడడంతో సంబంధిత అధికారులు గుంత తీయించి అలాగే వదిలేశారు. దీంతో ప్రమాదకరంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చివేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

-కోరుట్ల రూరల్, మే 15

పంట మార్పిడితో అధిక దిగుబడి

మన సంస్థ-మన విత్తనం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల రూరల్, మే 15: రైతులు కాలానికి అనుగుణంగా మారాలని, పంట మార్పిడితో అధిక దిగుబడి సాధించవచ్చని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామంలో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం పొలాస వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో రైతులకు పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ, రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టిసారించాలన్నారు. అనంతరం 'మన సంస్థ-మన విత్తనం' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీజేటీఏయూ వీసీ జానయ్య, ఏడీఆర్ శ్రీలత, ఏడీ సాయిదా నాయక్, డీఏవో భాస్కర్, డీఏవో తిరుపతి నాయక్, శ్యాం, స్వాతి, శాస్త్రవేత్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో పండ్ల తోటల పెంపకం

- సన్న, చిన్నకారు రైతులకు వంద శాతం సబ్సిడీ
- మూడేళ్ల వరకు నిర్వహణకు ప్రోత్సాహకం అందజేత

మండలంలో ఓ రైతు సాగు చేస్తున్న పండ్ల తోటలు

సారంగాపూర్, మే 15: ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకానికి కేంద్ర ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తున్నది. మూడేళ్ల పాటు మెయింటనెన్స్ చార్జీలను బతికి ఉన్న మొక్కల సంఖ్య ఆధారంగా రైతుకు నెలకు రూ. 3 వేలు మించకుండా చెల్లిస్తుంది. జగిత్యాల జిల్లాలో చాలా నేలలు పండ్లతోటలకు అనువుగా ఉన్నాయి. 2025-26 సంవత్సరానికి గానూ జిల్లాలో పండ్ల తోటల ఏర్పాటుకు మండలాల వారీగా అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించారు. జిల్లాలోని 18 మండలాల్లో వెయ్యి ఎకరాలు టార్గెట్‌గా నిర్ణయించి, ఆ దిశగా అధికారులు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 254.50 ఎకరాల్లో పండ్ల తోటల ఏర్పాటుకు 164 మంది రైతులను గుర్తించారు. సారంగాపూర్ మండలంలో 50 ఎకరాలు టార్గెట్ ఉండగా ఎనిమిది మంది రైతులు 12 ఎకరాలు, బీర్‌పూర్ మండలంలో 45 ఎకరాలు టార్గెట్ ఉండగా, ఒక రైతు ఎకరంలో పండ్ల తోటల పెంపకానికి ముందుకు రాగా అధికారులు వివరాలు నమోదు చేశారు.

అనుమతించిన పండ్ల తోటలు

ఉపాధి హామీ పథకం కింద మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, మునగ, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్స్, సపోటా, ఆపిల్ బేర్, బత్తాయి, అల్లనేరేడు, ఆయిల్ పామ్ తోటల పెంపకానికి అనుమతిచ్చింది. తోటల పెంపకానికి సన్న, చిన్నకారు రైతులందరూ అర్హులే. జాబ్‌కార్డుతో పాటు బోరు, బావి ఉండాలి.

రైతులకు వందశాతం సబ్సిడీ

గ్రామాల్లో చిన్న, సన్నకారు రైతులందరూ వందశాతం సబ్సిడీతో పండ్లతోటలు ఏర్పాటు చేసుకోవచ్చు. తోటలు ఏర్పాటు చేసుకునే వారికి బోరు లేదా బావి ఉండాలి. 13 రకాల పండ్ల తోటలు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉంది. పండ్ల తోటల పెంపకంతో రైతులు అధిక లాభాలు పొందవచ్చు. ఆసక్తి గల రైతులు దరఖాస్తు ఫాం, పట్టాపాసు పుస్తకం, బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులు, మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, గ్రామ పంచాయతీ తీర్మాన పత్రంతో గ్రామ పంచాయతీల్లో లేదా ఏఈవో, ఈజీఎస్ కార్యాలయంలో సంప్రదించాలి.

-గంగాధర్, ఎంపీడీవో, సారంగాపూర్

స్వగ్రామానికి కొత్తపేటవాసి మృతదేహం

వెల్గటూర్, మే 15: ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన బూట్ల రాజేందర్ (35) ఉపాధి కోసం ఏడాది క్రితం సౌదీ అరేబియా వెళ్లి అక్కడ ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. గత నెల 21న కూరగాయలు కొనుక్కోవడానికి బయటకు వెళ్లగా కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, విషయం స్థానిక నాయకులు విప్ లక్ష్మణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా, స్పందించి అక్కడి అధికారులతో మాట్లాడి మృతదేహం ఇక్కడికి పంపించేలా ఏర్పాట్లు చేశారు. మృతదేహం గురువారం హైదరాబాద్‌కు చేరుకోగానే అంబులెన్సులో స్వగ్రామానికి తీసుకురాగా, కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని రాజేందర్ కుటుంబసభ్యులు కోరుతున్నారు.

హబ్సీపూర్ వాసి మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించాలి

జగిత్యాల రూరల్, మే 15: జగిత్యాల రూరల్ మండలం హబ్సీపూర్ గ్రామానికి చెందిన కారం నర్సయ్య మలేషియాలో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు, నాయకులు గురువారం జగిత్యాలలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను కలిసి నర్సయ్య మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించాలని వేడుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే మలేషియాలో ఉంటున్న కల్లెడ గ్రామానికి చెందిన గాజంగి రంజిత్‌తో ఫోన్లో మాట్లాడారు. నర్సయ్య మృతదేహం ఇండియాకు వచ్చేలా చేపట్టే చర్యల గురించి చర్చించారు. తెలంగాణ రాష్ట్ర ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీతో మాట్లాడి, మలేషియాలో ఉన్న ఇండియా ఎంబసీ అధికారులకు సమాచారం అందించి మృతదేహం స్వగ్రామానికి వచ్చేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముస్కు నారాయణ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, గడ్డం నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

రైతులు డీడీలు చెల్లించాలి

సారంగాపూర్, మే 15: మండలంలో ఆయిల్ పామ్ సాగు చేసే రైతులు డీడీలు కట్టాలని ఏఈవోలు ఆంజనేయులు, వెంకటేశ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డ్రిప్ జనరల్ రైతులకు 90 శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం రాయితీపై ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈనెల 17వ తేదీ వరకు డీడీలు చెల్లించాలని పేర్కొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళాలు

సారంగాపూర్, మే 15: రేచపల్లి గ్రామ శివారులోని పోచమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులు చేపడుతున్నారు. కాగా, గురువారం ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో దర్వాజా ఏర్పాటు చేశారు. ఆలయ అభివృద్ధికి దాతలు విరాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

సారంగాపూర్, మే 15: బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామానికి చెందిన వెన్న లతకు రూ. 30 వేలు, పాముల అక్షయ్‌కి రూ. 21 వేలు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం మంజూరైంది. కాగా, కాంగ్రెస్ నాయకుడు గుడిసె జితేందర్ యాదవ్ గురువారం లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పూడూరి రమేశ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండగారాలు

జగిత్యాల, మే 15 : గ్రంథాలయాలు విజ్ఞాన భాండగారాలు అని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ ప్రైమరీ స్కూల్‌లో, జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అభివృద్ధి పనులకు గురువారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ, లైబ్రరీ సెస్ ద్వారా లైబ్రరీల ఏర్పాటు, అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్పందన, మున్సిపల్ మాజీ చైర్మన్లు గిరి నాగభూషణం, అడువాల జ్యోతి, మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, డీఈ నాగేశ్వర్, ఏఈ శరన్, నాయకులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని వినతి

జగిత్యాల, మే 15: జగిత్యాలలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను గురువారం జిల్లా స్వచ్ఛ భారత్ ఔట్ సోర్సింగ్ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు కలిశారు. తమకు వేతనం రూ. 20 వేలకు బదులు రూ. 16 వేలు చెల్లించారని, జీతాన్ని యథావిధిగా చెల్లించేలా చూడాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.

బీమా చెక్కు అందజేత

బీమా చెక్కు అందజేస్తున్న తహసీల్దార్, బ్యాంక్ మేనేజర్

కోరుట్ల, మే 15: పట్టణంలోని గాయత్రి బ్యాంక్ నిర్భయ సేవింగ్ ఖాతాదారు శివరాత్రి సాగర్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ప్రమాద బీమా కింద రూ.లక్ష మంజూరైంది. కాగా, సాగర్ తల్లి లక్ష్మికి గురువారం ఇన్‌చార్జి తహసీల్దార్ ఫారూక్, బ్యాంక్ మేనేజర్ రోహిత్ చేతుల మీదుగా చెక్కు అందజేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, ఖాతాదారులకు గాయత్రి బ్యాంక్ మెరుగైన సేవలందించడం అభినందనీయమని కొనియాడారు.

నాణ్యమైన విద్యనందించాలి

కమాన్‌చౌరస్తా, మే 15: ప్రభుత్వ ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ టెక్నో స్కూల్‌లో విభిన్న అంశాల్లో ఐదు రోజుల శిక్షణ ఇస్తుండగా, గురువారం ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులపై బోధనాపరమైన బాధ్యతలే కాకుండా, విద్యార్థుల సంరక్షణ బాధ్యతలు కూడా ఉన్నాయన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన నైపుణ్యమెలకువలు నేర్చుకొని పాఠాలు బోధించాలన్నారు. కార్యక్రమంలో సీపీ గౌస్ ఆలం తదితరులు పాల్గొన్నారు

బాధిత కుటుంబానికి పరామర్శ

మల్లాపూర్, మే 15: మండలంలోని గొర్రెపల్లి గ్రామానికి చెందిన మాదం నాగరాజు ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను బుధవారం అఖిల భారత యాదవ మహాసభ నాయకులు పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని సంఘం తరఫున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గంగరాజం యాదవ్, దనరేకుల సంతోష్‌యాదవ్, బండ మల్లేశ్, బండారి వెంకటేశ్, రెబ్బటి రాజశేఖర్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డుకు భూమి విరాళం



ఐక్యవేదిక సభ్యులకు స్థల పత్రాలను అందజేస్తున్న దాత విజయ్‌రావు

మల్లాపూర్, మే 15: మండలంలోని చిట్టాపూర్ గ్రామానికి చెందిన బైర్నేని కాంతరావు-రాజవ్వ దంపతుల జ్ఞాపకార్థం కుమారుడు బైర్నేని విజయ్‌రావు గ్రామంలో మార్కెట్ యార్డు కోసం పది గుంటల భూమిని బీసీ, ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక సంఘం సమక్షంలో పంచాయతీ కార్యదర్శి అశోక్ అప్పగిస్తు గురువారం పత్రాలు అందజేశారు. గ్రామం మధ్యలో మార్కెట్ యార్డు కోసం విలువైన భూమిని విరాళంగా అందించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేయడంతో పాటు విజయ్‌రావును శాలువాతో సన్మానించారు.

వేగంగా ధాన్యం కొనుగోళ్లు

ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

పెగడపల్లి, మే 15: మండలంలో పెగడపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం వరకు లక్షా వెయ్యి క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు సీఈవో తడ్కమడ్ల గోపాల్‌రెడ్డి తెలిపారు. ఐకేపీ ఆధ్వర్యంలో 68 వేల క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు ఏపీఎం సమత చెప్పారు. సంచర్ల సహకార సంఘం ఆధ్వర్యంలో 43 వేల క్వింటాళ్లు, నందగిరి సహకార సంఘం ఆధ్వర్యంలో 28 వేల క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు సీఈవోలు రౌతు మధుకర్, సంకిటి రవీందర్‌రెడ్డి తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలిస్తున్నామని, రైతుల బ్యాంక్ ఖాతాల్లో రూ.37 కోట్లు జమ అయ్యాయని నిర్వాహకులు తెలిపారు. కొనుగోళ్లలో వేగం పెంచి మరో వారం రోజుల్లో మండలంలో పూర్తి చేస్తామని చెప్పారు.

సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

పెగడపల్లి, మే 15: మండల కేంద్రంలో సార్వత్రిక సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఏఐటీయూసీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల భూమేశ్వర్ మాట్లాడుతూ, ఈ నెల 20న దేశ వ్యాప్తంగా చేపడుతున్న సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శనిగరపు ప్రవీణ్, రాజ్‌కుమార్, రాకేశ్, శంకర్, సుధాకర్, అంజి, స్వామి, రాజయ్య, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

వెంగళాయిపేటలో పశువైద్య శిబిరం

పెగడపల్లి, మే 15: పెగడపల్లి మండలం వెంగళాయిపేటలో మండల పశువైద్య శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి హేమలత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సులోచన-తిరుపతి, కారోబార్ మల్లయ్య, పశు వైద్య సిబ్బంది మతిన్, నర్సయ్య, రైతులు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన కానిస్టేబుల్

జగిత్యాల రూరల్, మే 15: జగిత్యాలకు చెందిన బింగి సురేశ్‌కు ఆపరేషన్ కోసం 'ఏ' ప్లస్ రక్తం అవసరం కాగా, గురువారం చల్‌గల్ ప్రాణదాతల సమూహం ఫౌండర్ మెంబర్ రాజేశ్వర్‌కు సమాచారం అందించారు. సామాజిక మాధ్యమంలో చల్‌గల్ ప్రాణదాతల సమూహంలో విషయం తెలుసుకున్న జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ కర్రె నరేశ్ స్పందించి రక్తదానం చేశారు. నరేశ్‌ను సురేశ్ కుటుంబసభ్యులు అభినందించారు.

సుఖ్‌దేవ్ తాపర్ జయంతి వేడుకలు

కథలాపూర్, మే 15: కథలాపూర్ మండలం సిరికొండ గ్రామంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు సుఖ్‌దేవ్ తాపర్ జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారత దేశ స్వాతంత్ర్యం కోసం సుఖ్‌దేవ్ తాపర్ భగత్‌సింగ్‌తో కలిసి పోరాటం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాసోజి ప్రశాంత్, గాంధారి శ్రీనివాస్, ప్రతాప్, అశోక్, గణేశ్, భాను పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు సత్కారం

కథలాపూర్, మే 15: కథలాపూర్ మండలం దుంపేట గ్రామానికి చెందిన తీగల మౌనిక, నక్క రుశేందర్, తునికి సన్నికుమార్, పిట్టల చరణ్ పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించగా, గురువారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ ఉడుగుల రాజేందర్, వీడీసీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మాదాపూర్ వాసికి డాక్టరేట్

కోరుట్ల రూరల్, మే 15: మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన దాసరి ప్రభాదేవి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నట్లు కుటుంబ సభ్యులు గురువారం తెలిపారు. ఓయూ ప్రొఫెసర్ వీబీ నరసింహ మార్గదర్శకత్వంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో 'ఇండిటిటీ ఆఫ్ యోక్సెన్ మేనేజ్‌మెంట్ ఇన్ పబ్లిక్ క్లౌడ్ ఫేమ్ వర్క్స్' అంశంలో ప్రభాదేవి పరిశోధన చేసి సమర్పించగా, డాక్టరేట్ అందించినట్లు పేర్కొన్నారు.

క్రీడలతోనే ఫిజికల్ ఫిట్‌నెస్

కొత్తపల్లి, మే 15: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు చాలా ముఖ్యమని.. ఫిజికల్‌గా బాగున్నప్పుడే మెంటల్‌గా ఫిట్‌గా ఉంటారని కరీంనగర్ సీపీ గౌస్ ఆలం పేర్కొన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నెలరోజుల పాటు నిర్వహించనున్న ఉచిత వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను గురువారం రాత్రి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, ఈ సమ్మర్ క్యాంప్ లు విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటాయని, వేసవిలో వారికి నచ్చిన క్రీడను నేర్చుకుంటూ ఉల్లాసంగా ఉండవచ్చన్నారు. తమ హయాంలో ఇలాంటి సమ్మర్‌క్యాంప్‌లు లేవని, వేసవిలో గ్రామాలకు వెళ్లి బంధువులు, కుటుంబ సభ్యులతో సేద తీరేవారమన్నారు. పిల్లలతోపాటు వారి తల్లిదండ్రులు స్టేడియానికి వచ్చి వాకింగ్, ఇతరత్రా వ్యాయామం ద్వారా ఫిజికల్ ఫిట్‌నెస్‌పై దృష్టిసారించాలన్నారు. తమ హయాంలో సెల్‌ఫోన్లు లేవని, ఇప్పుడు రెండుమూడేండ్ల పిల్లలు సైతం ఫోన్లకు బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడలతో విద్యార్థుల్లో శారీరక, మానసిక ధైర్యం రెట్టింపవుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ, కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏడ్డేండ్లుగా వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు రోజులో రెండు గంటలపాటు క్రీడలపై, స్కిల్ డెవలప్‌మెంట్‌పై దృష్టిసారిస్తే భవిష్యత్ బాగుంటుందన్నారు. 17క్రీడాంశాల్లో ఇవ్వనున్న శిక్షణలకు ఇప్పటివరకు 1,700 మంది దరఖాస్తులు సమర్పించారని, వీరికోసం అనుభవజ్ఞులైన శిక్షకులను ఎంపిక చేశామన్నారు. శిక్షణ సమయంలో పిల్లలకు పోషకాహారంగా గుడ్డు, పాలు, అర టి పండ్లు అందిస్తున్నామని తెలిపారు. జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్ క్రీడల నిర్వహణలో ఎప్పుడు ముందుంటారని, ఆయన సహకారంతోనే ఈ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నగరపాలక సంస్థ తరఫున శిబిరాల నిర్వహణకు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.

లో వోల్టేజీ సమస్య పరిష్కారం

మాట్లాడుతున్న ఉప్పువాడ వాసులు

వెల్గటూర్, మే 15: కిషన్‌రావుపేటలోని ఉప్పువాడలో విద్యుత్ లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని యువకులు వెల్గటూర్ సబ్ స్టేషన్‌ను ముట్టడించారు. కాగా, 'నమస్తే తెలంగాణ'లో 'సబ్ స్టేషన్ ముట్టడి' శీర్షికన బుధవారం కథనం ప్రచురితమైంది. స్పందించిన ఏఈఈ శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకొని ఉప్పువాడలో 25 కేవీఏ డీటీఆర్‌ను ఏర్పాటు చేయడంతో లోవోల్టేజీ సమస్య తీరింది.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

కథలాపూర్, మే 15: కథలాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ పనులపై 15వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 19 గ్రామాల్లో ఏడాది కాలంలో ఉపాధిహామీ పథకంలో రూ. 7.30 కోట్ల పనులు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. వీటిపై సామాజిక తనిఖీ బృందాలు గ్రామాల వారీగా వారం రోజులు పరిశీలించి, నివేదికలను ప్రజావేదికలో సమర్పించారు. కూలీల హాజరు నమోదులో కీలకమైన మస్టర్లలో కొట్టి వేతలు, సరిదిద్దడం ఉండడాన్ని చూసి ఫీల్డ్ అసిస్టెంట్ల పనితీరుపై అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో హరితహారం మొక్కలు ఎండిపోయాయని తెలుపగా, నీటి సమస్యతో ఎండిపోయినట్లు సిబ్బంది సమాధానమిచ్చారు. ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటించాలని కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లను అధికారులు ఆదేశించారు. ఉపాధిహామీ పనుల పర్యవేక్షణకు గ్రామస్థాయిలో మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేశారని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కాగా, అధికారులు, సిబ్బంది నుంచి రూ. 38,109 రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్, విజిలెన్స్ అసిస్టెంట్ మేనేజర్ దేవేందర్‌రెడ్డి, అంబుడ్స్‌మెన్ కృష్ణారెడ్డి, మల్లికార్జున్, ఎంపీడీవో శంకర్, ఎస్సార్పీ ప్రదీప్‌కుమార్, ఏపీవో రాజేందర్, ఈసీ లక్ష్మయ్య, కార్యదర్శులు, ఫీల్డ్ అసిసెంట్లు పాల్గొన్నారు.

రక్త నిల్వలు పెంచుకుందాం

జగిత్యాల రూరల్, మే 15: రక్తదాతల సహకారంతో రక్త నిల్వలు పెంచుకొని ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడుదామని జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్లో ఐఎంఏ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో రక్త నిల్వల గురించి తెలుసుకోవడానికి రక్త కోష్ అనే మొబైల్ యాప్ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర గూడూరి హేమంత్, ప్రధాన కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్, కోశాధికారి కోటగిరి సుధీర్ కుమార్, వైద్యులు ఎం మోహన్ రెడ్డి, సతీశ్‌కుమార్, గురువారెడ్డి, చంద్రశేఖర్ గౌడ్, మోర సుమన్ కుమార్, అజయ్ రెడ్డి, బ్లడ్ బ్యాంక్ అధికారి గీతిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మేడిపల్లి, మే 15: భీమారం మండల కేంద్రానికి చెందిన కస్తూరి రాజేశ్వర్ మెకాళ్ల శాస్త్ర చికిత్స చేయించుకొని ఇంటికి రాగా గురువారం టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి పరామర్శించారు. ప్రమాదంలో గాయపడిన గుండేటి శంకర్, అనారోగ్యంతో బాధపడుతున్న కారోబార్ వనితను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుక